క్లుప్తంగా

1 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

హనుమంతునిపాడు: మండలంలో అక్టోబర్ 1 నుంచి 14వ తేదీ వరకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 1, 2 తేదీల్లో లింగంగుంట్ల, గాయంవారిపల్లి, 3, 4 తేదీల్లో వేములపాడు సచివాలయ పరిధిలో వేములపాడు, మహమ్మదాపురం పంచాయతీలోని గ్రామాల్లో, 5, 6 తేదీల్లో వాలిచర్ల సచివాలయ పరిధి వాలిచర్ల, అప్పలరెడ్డిపల్లి, నందిరెడ్డిపల్లి గ్రామాల్లో, 7,8 తేదీల్లో పెద్దగొల్లపల్లి సచివాలయ పరిధిలో గొల్లపల్లి, కుడుములకుంట గ్రామాల్లో, 9,10 తేదీల్లో తిమ్మారెడ్డిపల్లి సచివాలయ పరిధిలో తిమ్మారెడ్డిపల్లి, ఆవులవారిపల్లి, ఎలికవారిపల్లి, వెంగపల్లి ,నల్లగండ్ల గ్రామాల్లో, 11, 12 తేదీల్లోసీతారాంపురం సచివాలయ పరిధి సీతారాంపురం, దొడ్డిచింతల, కిష్టంపల్లి గ్రామాల్లో, 13,14 తేదీల్లో హనుమంతునిపాడు సచివాలయ పరిధిలో హనుమంతునిపాడు, మొరవారిపల్లి, కొత్తూరు బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొంటారన్నారు.

జిల్లాస్థాయి ఆటల పోటీలకు పెదపవని విద్యార్థులు

లింగసముద్రం: జిల్లా స్థాయిలో ఈ నెల 27న జరిగే ఆటల పోటీలకు పెదపవని భోరావ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైట్లు హెచ్ఎం టి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ నెల 19, 20న జరిగిన స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరచడతో మండల స్థాయిలో ఎంపికై 23, 24 తేదీల్లో నియోజకవర్గస్థాయి ఆటల పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఆ పోటీల్లో ప్రతిభ చాటిన ఎస్‌కే నసిహా, ఎం.మోక్ష, పి.ధనుశ్రీ, కె.లాస్యప్రియ, ఎస్‌కె.అన్వర్, ఎస్‌కె.అబ్దుల్‌రెహ్మాన్, సీహెచ్ యస్వంత్, బి.శరణ్యలు ప్రతిభ కనబరచడంతో జిల్లాస్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

గుడిసెల్లోకి వెళ్లి వైద్య పరీక్షలు



టెంకాయచెట్లపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఉలవపాడు: వైద్యానికి దూరంగా ఉండే కాలనీలలో సైతం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య పరీక్షలు అందుతున్నాయి. మండల పరిధిలోని కరేడు పంచాయతీలోని టెంకాయచెట్లపాలెంలోని కాలనీలోకి వైద్య పరీక్షలు చేశారు. వారికి ఉచితంగా మందులు అందచేశారు. వారి సమాచారాన్ని నమోదు చేసుకున్నారు. ఉలవపాడు పరిధిలోని చాకిచర్ల, కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తున్నారు.

పన్నులు వెంటనే చెల్లించాలి

కందుకూరు: 2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ సంవత్సరం ఈ నెల 30వ తేదీతో ముగుస్తున్నందున ఇంకా పన్ను బకాయిలు ఉన్న వారు వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ సోమవారం సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు, వీటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించాలన్నారు. సకాలంలో పన్నులు చెల్లించకుంటే జరిమానాలు విధిస్తామని, బకాయిలు ఉన్న వారు వెంటనే పన్నులు చెల్లించాలని కోరారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయాల పాలైన చెన్నారెడ్డి

పీసీపల్లి: ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని పీసీపల్లి నుంచి శంకరాపురానికి వెళ్తున్న గోపవరపు బాల చెన్నారెడ్డి, వెంగమ్మలు బైక్‌పై వస్తుండగా పీసీపల్లి పెట్రోల్ బంకు నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ పై వస్తున్న చెన్నారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కనిగిరికి తరలించారు. ఎస్సై కె.మాధవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29న మెగా కరుణ శాఖాహార ర్యాలీ

కందుకూరు: పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 29న పట్టణంలో మెగా కరుణ శాఖాహార ర్యాలీ నిర్వహించనున్నట్లు స్పిరిచువల్ ధ్యానమాస్టర్ రాము సోమవారం తెలిపారు. కోవూరురోడ్డులోని లలితాంబ ధాన్య పరిమిడ్ కేంద్రం ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అతిథులుగా శిద్దా నాగేశ్వరరావు పాల్గొంటారు. అనంతరం సీనియర్ పిరమిడ్ మాస్టర్ సైదారావు దంపతులచే ధ్యాన శిక్షణ జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో పాల్గొనే వారికి ఉదయం అల్పాహార విందుతో పాటు, మధ్యాహ్నం భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తామని, పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాకల తీరంలో నిమజ్జన సందడి





పాకల తీరంలో నిమజ్జనానికి వచ్చిన వినాయక విగ్రహాలు

సింగరాయకొండ: మండలంలోని పాకల సముద్రతీరంలో 8వ రోజు సోమవారం వినాయక విగ్రహాల నిమజ్జనం జోరుగా సాగింది. తీరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ దాచేపల్లి రంగనాథ్ ఆధ్వర్యంలో ఎస్సై టి.శ్రీరామ్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. సోమవారం 82 విగ్రహాలు నిమజ్జనానికి వచ్చినట్లు ఎస్సై తెలిపారు. బందోబస్తులో జరుగుమల్లి ఎస్సై వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉలవపాడు: మండల పరిధిలో గణనాథులకు భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ముందుగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. రామాయపట్నం, అలగాయపాలెం, కరేడు సముద్ర తీరాల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులు సముద్రస్నానమాచరించారు.



తీరంలో బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ రంగనాథ్



అలగాయపాలెం తీరంలో వినాయక నిమజ్జనం

అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ ప్రకాశం, ప్రజాప్రతినిధులు

● ఎంపీపీ దంతులూరి ప్రకాశం

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తున్నట్లు ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. ఎంపీపీగా రెండేళ్ల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎంపీపీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రకాశం మాట్లాడుతూ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆశీస్సులతో మండలంలోని అన్ని గ్రామాల్లో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌ల సహకారంతో ముందడుగు వేస్తున్నట్లు చెప్పారు. అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందచేసినట్లు చెప్పారు.

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలను అందచేసిన ఘనత వైఎస్సార్ సీపీ దేనన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు, విస్తరణాధికారి ఓ అన్నమ్మ, పరిపాలన అధికారి జే ఫ్రాన్సిస్ బాబు, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు



బాలయోగినగర్‌లో ఇంటింటి సర్వేలో పాల్గొన్న డాక్టర్ ఉజ్వల



సాధువారిపాలెంలో ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీధర్‌రెడ్డి

సింగరాయకొండ: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-4 పరిధిలోని బాలయోగినగర్‌లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఉజ్వల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. డాక్టర్ ఉజ్వల మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, కళ్లె పరీక్షలు చేసి వివరాలు యాప్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అక్టోబర్ 10వ తేదీన సచివాలయం పరిధిలో జరిగే ప్రత్యేక క్యాంపులో స్పెషలిస్టు డాక్టర్లు పాల్గొంటారని, కిడ్నీ, గుండె, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సీహెచ్‌ఓ సాంబశివరావు, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌అలీ, టి.శ్రీనివాసులు, ఏఎన్ఎం నశీమున్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జరుగుమల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా ప్రజల ఇంటి వద్దనే వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ కంచుకొండ శ్రీధర రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాలేటిపాడు సచివాలయ పరిధిలో సాధువారిపాలెం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 48 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో లక్కాకుల అనంతమ్మ నరాల బలహీనతతో మంచానికే పరిమితం కావడంతో డాక్టర్‌శ్రీధర్‌రెడ్డి పరీక్షించి మందులు అందజేశారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ అనిత, ఏఎన్ఎం భారతి, డీఈఓ స్వాతి పాల్గొన్నారు.

మున్సిపల్ స్పందనకు 13 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

కందుకూరు: కందుకూరు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి 13 ఫిర్యాదులు వచ్చినట్లు కమిషనర్ మనోహర్ తెలిపారు. వీటిలో వ్యక్తిగత సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమస్యలు, పారిశుద్ధ్యం వంటి తదితర సమస్యలున్నట్లు పేర్కొన్నారు. వచ్చిన ఫిర్యాదులను ఆయా విభాగాలకు పంపి వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందనకు రాలేని ప్రజలు 9177700267 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు.

స్పందనకు 23 అర్జీలు

కనిగిరి రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 23 అర్జీలు వచ్చాయి. కనిగిరి మండలం నుంచి 3, కేకేమిట్ల 4, హెచ్ఎం పాడు 3, వెలిగండ్ల 1, పాదిలి2, పామూరు 2, సీఎస్‌పురం 4, మర్రిపూడి మండం నుంచి 4 అర్జీలను అర్డీఓ తోట అజయ్‌కుమార్‌కు స్పందనలో అందచేసినట్లు స్పందన వీఆర్వో రఘు రామయ్య, తెలిపారు. వాటిని పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ పేర్కొన్నారు. డీఏఓ జయవర్ధన్, వివిధ మండలాల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందనకు 3 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఎస్ హరిబాబు తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ సర్టిఫికెట్ల కోసం అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

స్పందనకు రెండు అర్జీలు

గుడ్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి రెండు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ రాజశేఖరరావు తెలిపారు. వచ్చిన అర్జీల వివరాలను ఆయన వివరించారు. తనను పొదుపు గ్రూపులో నుంచి అకారణంగా తొలిగించారని పొట్లూరు గ్రామానికి చెందిన పులపాటి తిరుమల అనే మహిళ ఒక అర్జీ, జగనన్న కాలనీలలో గృహాల నిర్మాణాలకు గ్రామానికి దగ్గరలో ఉన్న మన్నేరు నుంచి ఇసుకను తెచ్చుకునేలా చర్యలు తీసుకోవాలని పూరేటిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు మరి కొందరు అర్జీ ఇచ్చారు. రెండు అర్జీలను ఆయా శాఖల పంపించి వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

క్రీడలతో పోటీతత్వం పెరుగుతుంది



వాలీబాల్ కోర్టు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్

సింగరాయకొండ: క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా యువతలో పోటీతత్వం పెరుగుతుందని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సోమవారం క్రీడా కోర్టుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ.. కాలేజీ ఆవరణలో నూతనంగా వాలీబాల్, టెన్నికాయిట్ కోర్టులు ఏర్పాటు చేశామన్నారు. రాబోయే రోజుల్లో కాలేజీలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు జరిగే అవకాశం ఉందన్నారు. అక్టోబర్ 6వ తేదీ వాలీబాల్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి జట్ల ఎంపికలు జరగనున్నట్లు తెలిపారు. క్రీడా కోర్టులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. వివిధ ప్రభుత్వ పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

పీసీపల్లి: విద్యార్థులు బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని కనిగిరి న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పారా లీగల్ వలంటీర్ గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ బాలల హక్కులైన జీవించే హక్కు, రక్షణ హక్కు, అభివృద్ధి చెందే హక్కు , భాగస్వామి హక్కు గురించి వివరించారు. బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పించారు. మీ తోటి పిల్లలు ఎవరైన చదువు మధ్యలో మానేసి పనికి వెళ్తే ప్రధానోపాధ్యాయులకు అధికారులు తెలియజేయాలన్నారు. బాలల విద్యాభివృద్ధికి సహకరించాలన్నారు. అలాగే బాల్య వివాహ నిషేధ చట్టంపై కూడా అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే 112కు సమాచారమందించాలని తెలిపారు. విద్యాహక్కు చట్టం, ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బి.అమర్నాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన సింగరాయకొండ విద్యార్థినులు



జరుగుమల్లి విద్యార్థులతో హెచ్ఎం

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు నలుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కె.మహాలక్ష్మి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు ఎస్‌టీకేఆర్ ఓరియంటల్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో యోగా విభాగంలో ఎ.తన్వి, ఫెన్సింగ్‌లో ఎ.తన్వి, పి.సుప్రియ, పి.జయశ్రీ, డి.స్వజన్‌గ్లోరీ ఎంపికయ్యారని వివరించారు. వీరందరు 7వ తరగతి చదువుతున్నారన్నారు. పీఈటీ ఎల్.లావణ్య, విద్యార్థినులను హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తా

జరుగుమల్లి: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం మర్రిబోయిన శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ నెల 23న తూర్పు గంగవరం జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో అందర్-17 కేటగిరీలో రామాల దోల అంజన, అండరు-14 కేటగిరీలో రామాల శృతి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు త్వరలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్‌టీ ప్రసాద్ తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం, పీఈటీ అభినందించారు.

కార్యకర్తల సంక్షేమం కోసమే జగనన్న బీమా



బీమా నమోదు చేస్తున్న జేసీఎస్ కన్వీనర్ కిశోర్



చినపవనిలో జేసీఎస్ కన్వీనర్ కృష్ణారెడ్డి

కందుకూరు: కార్యకర్తల సంక్షేమం కోసమే జగనన్న బీమా నమోదు చేయిస్తున్నామని వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ ముప్పవరపు కిశోర్ అన్నారు. సోమవారం 1వ వార్డులోని జనార్దన కాలనీలో జరిగిన గృహసారథుల బీమా నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రంలో క్రియాశీలక పాత్ర పోషించిన కార్యకర్తలు, గృహ సారథుల కుటుంబాలకు భరోసా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని, గృహసారథుల బీమా నమోదు ప్రక్రియ వేగంగా సాగుతుందని తెలిపారు. సచివాలయ కన్వీనర్ మస్తాన్‌వలి, గృహసారథులు పాల్గొన్నారు.

లింగసముద్రం: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు వైఎస్సార్ సీపీ కల్పిస్తున్న ఇన్సూరెన్స్ నమోదు కార్యక్రమాలను మండల జేసీఎస్ కన్వీనర్ వరికూటి క్రిష్టారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పిచ్చపాటి తిరపతిరెడ్డి సోమవారం పరిశీలించారు. మండలంలోని చినపవని, పెదపవని 1, 2 సచివాలయ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు చేస్తున్న ఇన్సూరెన్స్‌ను పరిశీలించారు. సర్పంచ్ దామా సీతారామయ్య, నాయకులు మందా కొండయ్య, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

రూ.80 లక్షల జెడ్పీ నిధులతో అభివృద్ధి



కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ లక్ష్మీకాంతం దంపతులు

పీసీపల్లి: రూ.80లక్షల జెడ్పీ నిధులతో మండలంలో అభివృద్ధి చేశామని జెడ్పీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం ఓకేరెడ్డిలు తెలిపారు. జెడ్పీటీసీగా పదవీ స్వీకరించి 2 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లక్ష్మీకాంతం స్వగృహంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ తన పదవీ కాలంలో పాలేటిపల్లిలో వాటర్ ప్లాంటు రూ.8లక్షలు, ముద్దపాడు బ్రిడ్జి నిర్మించేందుకు రూ.30లక్షలు, గోపవరపు పల్లిలో సీసీ రోడ్డుకు రూ. 5 లక్షలు, కోదండరామాపురం సీసీ రోడ్డుకు రూ. 8 లక్షలు, ఇంకా మరెన్నో అభివృద్ధి పనులు వెరసి మొత్తం రూ. 80 లక్షల జెడ్పీ నిధులు అభివృద్ధి చేశామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ యాదవ్, జెడ్పీచైర్మన్ బూచెపల్లి వెంకాయమ్మల సహకారంతో మరెంతో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, కొండారెడ్డి, శివరామిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం: మండలంలోని వీఆర్‌కోట వద్ద ఉన్న మన్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తునట్లు సమాచారం తెలియడంతో సిబ్బందితో వెళ్లి మన్నేరు నుంచి ఇసుకతో వెళుతున్న ట్రాక్టర్‌ను విఆర్ కోట గ్రామశివారుల్లో దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్సై చెప్పారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యూటీఎఫ్ జెండా ఆవిష్కరణ



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

గుడ్లూరు: యూటీఎఫ్ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు సోమవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా హిందూపురం నుంచి విజయవాడకు ప్రచార జాత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూటీఎఫ్ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఉపాధ్యాయులు సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తు విజయవంతంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు శేషు, ప్రధాన కార్యదర్శి చలపతి శర్మ, మండల నాయకులు మధుబాబు, రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా వెంకటేశ్వరస్వామి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో స్వామివారి చిత్రపటం



ముత్యాల పరమేశ్వరి ఆలయ ఆవరణలో విద్యుత్ ప్రభ

మర్రిపూడి: మండల కేంద్రమైన మర్రిపూడి వడ్డెర కాలనీలోని వెంకటేశ్వరస్వామి తిరునాళ్లను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉప్పుతోళ్ల పుల్లయ్య స్వాములవారి చిత్రపటాన్ని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం స్వామివారి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై ఉంచి ఊరేగించారు. చక్రస్నానం అనంతరం స్వామివారి ప్రతిమలను ఊరేగించి తిరిగి ఆలయంలో ఉంచారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ముత్యాల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రం ఏర్పాటు చేశారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సింగరాయకొండ: మండంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్ క్రీడలకు సంబంధించి ఎంపిక పోటీల్లో ఆరు మండలాలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆటల పోటీలను ఇన్‌చార్జి హెచ్ఎం శ్యామ్ ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్త్రీ, పురుషుల బాస్కెట్ బాల్ జట్ల ఎంపికలు సోమవారం స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం నిర్వహించారు. జిల్లా నుంచి 30 మంది పురుషులు, 25 మంది బాలికలు హాజరైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సురేష్, సెక్రటరీ టి.సుబ్బారావు తెలిపారు. వీరిలో నైపుణ్యం కలిగిన 12 మంది పురుషులు, 12 మంది స్త్రీలను ఎంపిక చేసినట్లు తెలిపారు.